## భక్తులకు సౌకర్యవంతంగా స్వామి దర్శనం

**-తిరుమలలో ఆకస్మిక తనిఖీల్లో అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**

తిరుమల, జులై 28ప్రభాతవార్తప్రతినిధి:



దేశం నలుమూలల నుండి దేవుని దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం చేయించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిర్దేశం చేశారు. సర్వదర్శనం టైమ్‌స్లాట్, 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, కాలినడక దివ్యదర్శనం భక్తులకు ఎంత సమయంలో దర్శనం చేయిస్తున్నారనేది ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుపథం మార్గంద్వారా చిన్న పిల్లల తల్లిదండ్రులు, దాతలతోబాటు వివిధ దర్శనాలకు సంబంధించి అనుమతిస్తున్న విధానాన్ని ఆయన ఆదివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీల్లో తెలుసుకుని స్వయంగా పరిశీలించారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






### నంది వాహనంపై దర్శనమిచ్చిన

# పార్వతీ పరమేశ్వరులు



పాకాల, జులై 28, ప్రభాతవార్త

పాకాల మండలం ఊట్లవారిపల్లి గ్రామం ఆనందగిరి కొండ పై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి 76వ ఆడికృత్తిక మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం కన్నాలగ్నమందు ధ్వజారోహణం తదుపరి యాగ పూజ గావించి రాత్రి నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులు ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు అత్తులూరి ఆనంద నాయుడు, రజిని మొదటి పూజ చేసి ఆలయ ఈవో ఉషారాణి, సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఆ దేవదేవుడు మేళ తాళాలతో మంగళవాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగిన పార్వతీ పరమేశ్వరులకు ఊట్ల వారిపల్లె ప్రజలు తమ మొక్కులను చెల్లించుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం సాయంత్రం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

### పద్మావతి వర్సిటీ హాస్టల్‌లో

# మత్తులో చిందులు



## మహిళ విశ్వవిద్యాలయంలో గాడితప్పిన పాలన!?

ప్రభాతవార్త–తిరుపతిటౌన్:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయమైన తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో పాలన గాడితప్పుతోందా!?... విద్యార్థినులకు క్రమశిక్షణ నేర్పాల్సిన ఆచార్యులు, అధ్యాపకులు చూసీచూడనట్లు సాగిపోతున్నారా??ఏకంగా కొందరు విద్యార్థినులు హాస్టల్ గదుల్లో గంజాయి. మద్యం సేవించి మత్తులో చిందులు వేయడం సంచలనంగా మారింది. నాలుగురోజుల క్రిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూడటంతో ఏకంగా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులు ఎవరూ ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్ళకూడదని ఉన్నఫళంగా హాస్టల్ వార్డెన్‌కు మౌఖిక ఆదేశాలివ్వడంతో విద్యార్థినులు గుర్రుమంటున్నారు. అంతేగాక తాజాగా విశ్వవిద్యాలయంలోని ఓ బ్లాక్‌లో ఉంటున్న న్యాయ విద్యార్థిని ఇష్టానుసారంగా బయటకు వెళ్లి, తెలిసిన స్నేహితురాలి ఇంట్లో గంజాయి మత్తులో అత్యాచారానికి గురైన ఘటన వెలుగు చూడటంతో పద్మావతి వర్సిటీలో విద్యార్థినులకు భద్రత కరువైందని, వర్సిటీలో ఆచార్యులు, అధ్యాపకులు పట్టించుకోవడంలేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో అటు పరిపాలన విభాగంలో పాలన గాడితప్పిందని, ఆచార్యుల మధ్య అంతర్గతపోరు సాగుతోందని, హాస్టల్‌లో విద్యార్థినులకు సరైన సౌకర్యాలు లేవని, కనీసం భోజనం కూడా సరిగా లేదని ఆరోపణలు ఉన్నాయి. అందుకే కళాశాల పనివేళల తరువాత సాయంత్రం అధికశాతంమంది విద్యార్థినులు బయటకు వెళ్ళి రాత్రి 6-7గంటల మధ్య తిరిగి హాస్టల్‌కు చేరుకుంటున్నా గంజాయి. మద్యం మత్తుకు బానిసలై హాస్టల్ గదుల్లో చిందులు వేస్తుండటంతో ఈ విషయం కలకలంగా మారింది. పక్కపక్క హాస్టళ్ళలో ఉంటున్న మిగిలిన విద్యార్థినులు మత్తులో చిందులు వేస్తున్న విద్యార్థినుల నుండి వేధింపులు, ఆందోళనకు గురవుతున్నారు. తొలి మహిళ విశ్వవిద్యా లయం, సరస్వతినిలయంగా ఉన్నత విలువలుతో విద్యాబోధన జరుగుతున్న విశ్వవిద్యాలయంగా రెండు తెలుగురాష్ట్రాల్లో ఖ్యాతి చెందింది. ఇదే నమ్మకంతో తెలుగురాష్ట్రాల నుండి విద్యార్థినులను ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో, పిజి సైన్స్,ఆర్ట్సు కోర్సులు, నర్సింగ్, ఇంజ నీరింగ్ , ఎంబిఎ ఎంసిఎ కోర్సుల్లో మంచి విద్యాబోధన, భద్రత, రక్షణ ఉంటుందనే అధికశాతంమంది తల్లిదండ్రులు ఇక్కడ చేర్పించ డానికి కష్టాలు పడుతుంటారు. తీరా సీటు వచ్చి ప్రవేశాలు పొందిన విద్యార్థినుల వ్యవహారంపై ఆచార్యులు, అధ్యాపకులు పర్యవేక్షణ కొరవ డిందనే ఆరోపణలుగా బలంగా విద్యార్థినుల నుండే వ్యక్తమవు తున్నాయి. వర్సిటీలో దాదాపు 10వరకు హాస్టల్ బ్లాక్‌లు ఉన్నాయి. ఈ హాస్టళ్ళనిర్వహణ, పర్యవేక్షణ ఆచార్యులైన ఒక వార్డెన్ ,ఆమెకు సహాయకులుగా అసిస్టెంట్ వార్డెన్‌లు, డిప్యూటీ వార్డెన్‌లు, మేట్రిన్‌లు ముప్ఫయి మందివరకు ప్రత్యేకంగా విధులు నిర్వహిస్తుంటారు. అయితే చాలావరకు అసిస్టెంట్ వార్డెన్‌లు, డిప్యూటీ వార్డెన్‌ల పర్యవేక్షణ పూర్తిగా లేదని, విద్యార్థినులు హాస్టల్ గదులకు ఎప్పుడు వస్తున్నారు, బయటకు ఎప్పుడు వెళుతున్నారనేది కూడా పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. ఇటీవల రెండు హాస్టల్ బ్లాక్‌ల్లో చోటుచేసుకున్న రెండు ఘటనలతో ఉలిక్కిపడి ఆందోళన చెందిన ఆచార్యులు, అధ్యాపకులు విద్యార్థినుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఉపకులపతి, రిజిస్ట్రార్ ఆదేశించారు. విద్యాబోధనలోనేగాక విశ్వవిద్యాలయం పరిపాలన వ్యవహారాలు పర్యవేక్షణలో ఎంతో అనుభవం, నైపుణ్యం ఉన్న ఉపకులపతిగా ఆచార్య ఉమ ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో ఆకతాయిల విద్యార్థినుల ఆగడాలపై ఎలాంటి కొరఢా ఝుళిపిస్తారనేది వేచిచూడాలని పలువురు విద్యార్థినులు చెబుతున్నారు. గతంలో "వార్త"లో తిరుపతిలో ప్రధానంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో శ్రీవేంకటేశ్వర, పద్మావతి మహిళ విశ్వవిద్యాలయాల ప్రవేశద్వారాల వద్ద నిఘా కొరవడిందనే వార్త ప్రచురితమైంది. ముందే హెచ్చరించినా చేతులు కాలేవరకు పట్టించుకోపోవడం విచారకరం.

### పసిడి శేష వాహనంపై

# కుమారస్వామి చిద్విలాసం

శ్రీకాళహస్తి,జూలై 28 ప్రభాతవార్త



శేష వాహనంపై స్కందుని రాజసం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారంరాత్రి పసిడి శేష వాహనంపై వల్లి దేవసేన సమేత కుమారస్వామి భక్తులకు దర్శ నమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో ఆడికృత్తికకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇక్కడి భక్తులే కాకుండా తమిళనాడు నుంచి వచ్చిన భక్తులు కూడా కుమారస్వామి కొండకువెళ్ళి దర్శనం చేసుకుంటారు. భరణి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లనుచక్కగా అలంకార మండపంలో రాజేష్ గురుకుల్ ముస్తాబు చేశారు. ఇఓ ఎన్‌వియస్ఎన్ మూర్తి పూజలు నిర్వహించి ఉత్సవానికి పట్టణంలో పంపారు. తేరువీధిలోని వాహనాల మండపం వద్ద బంగారు శేషవాహనంపై వల్లిదేవసే సమేత సుబ్రమణ్యం స్వామిని ప్రతిష్టించారు. ఆలయాధికారుల, ఉభయదారులు టిఎం కృష్ణప్పదేవర్ కుటుంబసభ్యులు, పిండి హేమాద్రి కుటుంబ సభ్యులు, మందల మునికృష్ణయ్య తరఫున వారి ప్రతినిధులు వెంటరాగా ఉత్సవం అంగరంగ వైభవంగా తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి, నారదపుష్కరిణి, నగరి వీధి, బజారువీధుల మీదుగా సాగింది. టెంపుల్ఇన్స్పెక్టర్లు సుదర్శనం నాయుడు,హరియాదవ్, లోకేష్‌రెడ్డి ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య ఆలయ సిబ్బంది వెంటరాగా ఉత్సవం సాగింది.

## భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

రామచంద్రాపురం, జూలై 28 ప్రభాతవార్త:

పరమాలలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుంధ ప్రవేశం చేశారు. భక్తులు ఉపవాస దీక్షతో వేపాకులు చేతపట్టుకుని 7 బావులలో స్నానమాచరించి కంకణం ధరించారు. అనంతరం ఆలయ పూజారి ద్రౌపథి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అగ్నిగుంధం వద్దకు తీసుకువచ్చారు. భక్తుల సమక్షంలో అగ్నిగుంధానికి పూజలు నిర్వహించి, పూలబంతిని అగ్నిగుంధంలోకి విసిరారు. నిప్పులతో అమ్మవారికి వడిమాల కట్టి, గోవింద నామ స్మరణల నడుమ భక్తులు అగ్నిగుంధ ప్రవేశం చేశారు.

## 41సి నోటీసులిచ్చి.... మోహిత్‌రెడ్డిని పంపేసిన పోలీసులు

**అప్రజాస్వామికంగా అరెస్ట్ చేసారు...నేను లా బైడింగ్ సిటిజననే**

**- తుడ మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూలై 28 ప్రభాతవార్త:

స్నేహితుడు పెళ్లికి దుబాయి వెళ్ళుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని శనివారం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో తిరుపతి పోలీసులు అదుపులోకి తీసు కున్న విషయం తెల్సిందే. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో 4గంటల విచారణ అనంతరం కర్ణాటక పోలీసు స్టేషన్ లోను విచారణ చేసి ఆదివారం ఉదయం ఎస్వీ యూనివర్శిటీలో పోలీ సుస్టేషన్‌కు తీసుకొచ్చారు. తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ పోలీసు స్టేషన్‌లో కొద్దిసేపు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని విచా రించి, 4సి నోటీసు జారీ పంపించి వేసారు. ఎప్పుడు విచారణకు పిలిచిన అందుబాటులో ఉండాలని పోలీసులు మోహిత్‌రెడ్డికి సూచించారు.

**100 కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదు: మోహిత్‌రెడ్డి**

అప్రజాస్వామికంగా అరెస్ట్ చేసి, భయాందోళన కలిగించేలా పోలీసులు వ్యవహరించారని....ఇలాంటి కేసులు వందపెట్టిన భయపడే ప్రసక్తే లేదని తుడ మాజీ చైర్మెన్ స్పష్టం చేసారు. ఆదివారం ఎస్వీ యూనివర్శిటీ పోలీసు స్టేషన్ నుండి బయటకు వచ్చిన మోహిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, తీవ్రవాదికి, ఆర్థిక నేరస్థుడికి జారీ చేసినట్టుగా లుక్ అవుట్ నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం 52రోజులుగా ఇంట్లో, బెంగళూరు, ఢిల్లీలో ఉన్నానని, ఏ ఒక్కరూ తనను విచారణకు పిలవలేదన్నారు. కేసులకు భయపడనని, ప్రజాపోరాటానికి సన్నద్ధమైతామని తెలిపారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి సిద్ధమైతున్న తరుణంలో భయాందోళన కలిగించే ధోరణిలో పోలీసులు వ్యవహరించారని తెలిపారు. ఇలాంటి ఘనట ఎమ్మెల్యే పులివర్తి నానికి కూడా పునరావృతమైతుందని, భవిష్యత్ డిఫాజిట్ రాకుండా ప్రజల్లోకి వెళ్తామని మోహిత్‌రెడ్డి తెలిపారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించానని..హుందా రాజకీయాలు చేయాలనుకుని రాజకీయాల్లోకి వచ్చానని...కానీ ప్రభుత్వ అరాచకాలతో వీధి పోరాటానికి సిద్ధమయ్యానని మోహిత్‌రెడ్డి తెలిపారు. తనపై అక్రమ కేసులు బనాయిస్తున్న పోలీసులను న్యాయస్థానంలో నిలబోడతానని హెచ్చరించారు. పోలీసులు పెడుతున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని, తుఫాకి తూటాలకు భయపడనని, ప్రతిపక్షంలో ఉంటూ ప్రజా పోరాటం చేస్తానని తెలిపారు.

### అరెస్ట్‌ను ఖండించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

అప్రజాస్వామికంగా అక్రమంగా తన కుమారుడు మోహిత్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, విడుదల చేసారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. విదేశాలలో ఉన్నత చదువులు చదివిన తన బిడ్డను వీధిపోరాటాలు చేసేలా రెచ్చగొడుతున్నారని వాపోయారు. తన బిడ్డలకు మంచితోపాటు సేవ చేసే తత్వాన్ని నేర్పించానని....తప్పు చేయడం తన బిడ్డలకు తెలియదని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఇకపై తన కుమారుడు నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా పోరాటాలకు సిద్ధమైతాడని తెలిపారు. కేసులకు భయపడే వంశం కాదని, జైళ్ళు తమకు కొత్తేమి కాదని తెలిపారు.

## క్వాడ్జ్ వ్యాపారంపై నేతల దృష్టి

**రూ. కోట్లలో సాగుతున్న వ్యాపారం**



అక్రమంగా తరలిపోతున్న తెల్లరాయి

వెంకటగిరి, జులై 28, ప్రభాతవార్త

ప్రముఖ నాయకులు చూస్తూ మొత్తం క్వాడ్జి (తెల్లరాయి) వ్యాపారం పైనే దృష్టి సారించారు. ఈ రాయి ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గం ఎక్కువగా లభ్యమవుతుంది. గత ప్రభుత్వంలో కొంత నాయకులు ఈ రాయి వ్యాపారం ద్వారా గడిచారని టిడిపి నాయకులు ఆందోళన కూడా చేశారు. కొందరు తెలుగుదేశం నాయకులు క్వాడ్జి వ్యాపారం పై దృష్టి సారించాలని వైసిపి నేతలు విమర్శిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, బాలాయపల్లి మండలంలో తెల్లరాయి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు మండలం ప్రాంతంలో రాయి తవ్వకాలు జరుగుతున్నట్లు పలువురు నాయకులు విమర్శిస్తున్నారు. గతంలో టన్ను రెండు మూడు వేల రూపాయిలకు మించి ఈ రాయి ధర పలకకపోగా గత మూడు సంవత్సరాల నుండి టన్ను 50 వేల రూపాయిల వరకు పలుకుతోంది. దీంతో రాయిని తవ్వించి అక్రమంగా తరలిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూగర్భంలో శాఖ అధికారులు తెల్లరాయి తవకాలను ఆపి కొందరు వ్యాపారులకు జరిమాణాలు కూడా విధించారు. తెల్ల రాయి వ్యాపారం కోసం కొంత ప్రభుత్వ అనుమతి తీసుకోగా అనాధికారికంగా తన్నులు కొద్ది తరలిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని అక్రమ వ్యాపారం అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పద్మగిరిలో దండాయుధస్వామికి భరణి అభిషేకం

**నేడు ఆడికృత్తిక - ఏర్పాట్లు సిద్ధం**



విశేష అలంకరణలో స్వామివారు

తిరుపతి రూరల్, జూలై 27 ప్రభాతవార్త:

తిరుపతి రూరల్ మండలం తనపల్లె పంచాయతీ పద్మగిరి కొండపై వెలసిన శ్రీదండాయుధస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ఘనంగా భరణి అభిషేకం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు భరణి అభిషేకంలో పాల్గొన్నారు. శనివారం ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. సోమవారం ఆడికృత్తిక దృష్ట్యా భక్తుల రద్దీ ఎక్కువగా వుంటుందని, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తనపల్లె, కుంట్రపాకం సర్పంచ్‌లు కె.సునీత, శుభ తెలిపారు.

# ఆశల పల్లకిలో నామినేటెడ్ పదవుల ఆశావహులు!



శ్రీకాళహస్తి,జూలై 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయానికి అలాగే పార్టీ కష్టకాలంలో అండగా ఉంటూ కష్టాలు, కన్నీళ్ళు దిగమింగి పోలీసు లాఠీలకు ఎదురు నిలిచి నిష్కారణంగా అక్రమ కేసుల్లో కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఉమ్మడి పార్టీలైన తెలుగుదేశం,బిజెపి,జనసేన పార్టీకి చెందిన కార్యకర్తలు నామినేటెడ్ పదవుల్లో బెర్త్ దక్కుతుందా?అని ఎదురు చూస్తున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఐదేళ్ళ పాటు రాచరిక పాలన సాగింది. ఎదరు చెప్పినవారిపై కేసులతో భయభ్రాంతుల్ని చేసారు.ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు అప్పటి అధికార పార్టీలో చేరని వారిపై పోలీసు కేసులే కాకుండా దాడులు ఎదుర్కొన్నారు.

**ఆశావహుల్లో ఉత్కంఠత:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 43వేల ఓట్లు మెజారిటితో గెలిపించారు. అయితే గెలిచిన తరువాత నియోజకవర్గంలో ఉన్న పరిమిత నామినేట్ పోస్టులలో ఎవరెవరికి అవకాశం దక్కుతుందనేది చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటి ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ పెద్దలు నామినేటెడ్ పదవుల్లో ఏ పార్టీకి ఎన్ని అనే అంశంపై స్పష్టతకు వచ్చారు. తెలుగుదేశం అధికారం దక్కించుకున్న నియోజకవర్గంలో ఆ పార్టీకి 60శాతం,మిత్రపక్షాలైన జనసేనకు30శాతం, బిజెపికి పది శాతం పదవులుగా పరిగణించుకోవాలని నిర్ణయానికి వచ్చారు అయితే శ్రీకాళహస్తిలో కీలకమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి చైర్మెన్ పగ్గాలను పార్టీలో కీలకంగా వ్యవహారించిన రంగినేని చెంచయ్యనాయుడుకు అప్పగించాలని శాసనసభ్యుడు భావిస్తున్నట్లు సమాచారం.ఇక ఇక్కడ సభ్యులు 15 మంది ఉంటారు. అందులో 9 మంది తెలుగుదేశం సభ్యులు నలుగురు జనసేన ఇద్దరు బిజెపి వారికి అవకాశం ఉంటుంది. ఇందులో రిజర్వేషన్లును పాటించాల్సి ఉంటుంది. ఈ పదవులను తమ సహాచరులకు దక్కించుకోవాలని ద్వితీయశ్రేణి నాయకులు ఆలోచిస్తున్నారు.ఇక శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు సంబంధించి ఆది నుంచి పార్టీలో ఉంటూ డైరెక్టర్‌గా ఉపాధ్యక్షుడుగా పని చేసిన షేక్ ఖాదర్‌భాషా ఈ సారి తనకు చైర్మెన్ అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు చర్చించుకుంటున్నారు. ఇక ఇక్కడ సభ్యుల నియామకం జరగాల్సి ఉంటుంది. మరో అవకాశం కోఆపరేటివ్ పాలసరఫరా సంఘం. ఈ రెండింటికి ఎన్నికలు జరగాలి. సభ్యులు ఎన్నుకోవాల్సి ఉంటుంది.. ఇక ఎపి సీడ్స్ డైరెక్టర్ పదవి ఉంది. ఇది రైతులతో ముడిపడి ఉంటుంది. మరో రైతులకు సంబంధించిన సంస్థ 'శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి' ఇక్కడ కనీసం ఓ డజన్ మందికి అవకాశం కల్పించవచ్చు.

**మున్సిపాలిటికిపై ఏం నిర్ణయం తీసుకుంటారో?**

శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఎన్నికలపై కోర్టు వివాదాల నీలి నీడలు అలుముకున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చుట్టుపక్కల గ్రామాల విలీనంకు సంబంధించి ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ వారే గతంలో కోర్టులో అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్లు దాఖలు చేసి ఉన్నారు. ఈ పిటిషన్లు ప్రస్తుత శాసనసభ్యుని స్వగ్రామానికి పరిసరాల్లోని గ్రామాల వారే పిటిషన్లు దాఖలు చేసి ఉన్నారు. మరి ప్రస్తుతం ఆ పిటిషన్లను ఉపసంహారించుకొని ఎన్నికలకు వెళతారా? లేక తీర్పు రప్పించుకొని రెండున్నర సంవత్సరాలకు ఎన్నికలకు వెళతారా? వెళితే చైర్మెన్‌గిరి ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.పార్టీ కోసం పాటు పడిన వారిలో కేసులు పెట్టించుకున్న వారిలో మొదటి వరుసలో జి.విజయకుమార్‌నాయుడు, శ్రీకాళహస్తి మండలం నుంచి తాటిపర్తి రవీంద్రారెడ్డి, కామేష్‌యాదవ్,ఏర్పేడు నుంచి పలువురు, తొట్టంబేడు మండలం నుంచి గాలి చలపతి నాయుడు ఉన్నారు.ఇక పార్టీనే వెన్నంటి ఉన్న సీనియర్లు ఉన్నారు. నామినేటెడ్ పదవులంటే అందరిని సంతృప్తి పరచాల్సి ఉంటుంది. అధిష్టానం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రిజర్వేషన్లు పాటించాల్సి ఉంటుంది. ఇది ఎంతో కీలకమైన ఘట్టం.మరి ఎవరెవరికి నామినేటెడ్ పదవుల అవకాశం దొరుకుతుందో వేచి చూడాలి.

## సిఎం చంద్రబాబు కుటుంబీకులు, ఎమ్మెల్సీ కంచర్లపై అసభ్యకర పోస్టులు

### – వైకాపా కార్యకర్తపై పోలీసులకు దేశం నేతల ఫిర్యాదు !!

కుప్పం, జూలై 28 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు కుటుంబీకులు, ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌పై ఫేస్‌బుక్‌లో వైకాపా కార్యకర్త అసభ్యకర పోస్టులు పెట్టడం పట్ల తెదేపా నేతలు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరు అమ్ము అనే పేరిట ఫేస్ బుక్ అకౌంట్‌లో నూలుకుంట గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త తిరుపతి ఫేస్ బుక్‌లో మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి, సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనమ్మ, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ తదితరుల ఫోటోలు పెట్టడంతో పాటు కింద అసభ్యకరంగా పోస్టులు పెట్టాడు. దీంతో దేశం నేతలు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా అసభ్యకర పోస్టులు పెట్టిన తిరుపతిని కుప్పం పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసి ంది.

## 150కి ఉచిత వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ



కుప్పం, జూలై 28 ప్రభాతవార్త

బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధ్వర్యంలో గుడివంక శ్రీ సుబ్రమణ్యసా ్వమి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్ బాబు తెలిపారు. సుమారు 150మందికి బిపి, చక్కెర వ్యాధి, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు ప ంపిణీ చేసినట్లు తెలిపారు. సోమవారం కూడా ఈ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. అదేవిధంగా సోమవారం కుప్పం మండలం కూసూరు శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద సైతం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డా॥ హేమాద్రినాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టు ఎజిపికి ఘన సన్మానం

రామకుప్పం, జూలై 28 ప్రభాతవార్త



రాష్ట్ర హైకోర్టు సహాయ ప్రభుత్వ ప్లీడరు శరత్‌కుమార్‌ను శనివారం రాష్ట్ర దేశం నేత మునస్వామి తదితరులు ఘనంగా సత్కరించారు. న్యాయవాది శరత్‌కుమార్‌ను ఇటీవల ప్రభుత్వం సహాయ ప్లీడర్‌ను నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జయశంకర్, సత్తి, మహేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ముత్తుమారెమ్మ ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

కుప్పంరూరల్, జూలై 28 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ ఆలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులుగా హర్ష, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా అమర్‌నాథ్, సంయుక్త కార్యదర్శిగా ప్రతాప్, కోశాధికారిగా రమేష్, సహ కోశాధికారిగా ప్రమోద్‌కుమార్, సభ్యులుగా జయగణేష్, బాలాజీ, తిలక్, మల్లికార్జున, శ్రీనివాసులు, గణేష్,బాబు, పురుషోత్తంలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అర్చకుల సమక్షంలో అమ్మవారి ఆలయ హుండీలు లెక్కించగా రూ 3.31లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు.

## నేడు కూసూరులో ఆడికృతిక ఉత్సవాలు

కుప్పంరూరల్, జూలై 28 ప్రభాతవార్త

మండలంలోని కూసూరు అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ బాలసుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద సోమవారం ఆడికృతిక ఉత్స వాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త నాగవేలు, ఆలయ సేవా సంఘం వారు తెలిపారు. ఉదయం 10గంటలనుంచి సా ్వమివారికి భక్తులచే కావడి చెల్లింపులు జరుగుతాయన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12గంటలనుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఘనంగా భీమినేని చిట్టిబాబు జన్మదినం

పాలసముద్రం, జులై 28 ప్రభాతవార్త:



రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు జన్మదిన వేడుకలు పాలసముద్రంలోని ఆయన నివాసంలో శనివారం అర్ధరాత్రి నుండి ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిధిగా జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ హాజరయ్యారు. భీమినేని చిట్టిబాబు జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ భీమినేని చిట్టిబాబునాయుడుకు శాలువ కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ తినిపించారు. నియోజకవర్గ పరిధిలో భీమినేని చిట్టిబాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, సీనియర్ నాయకులు బాబునాయుడు, విజయ్‌కుమార్, రవినాయుడు, సాంబశివన్, తంగరాజు, ఆరుళ్‌నాదన్, ముగిదాస్, అవినాష్, సత్య, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్

చిత్తూరుటౌన్, జులై 28 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకుంటే ఆ సమస్యలను పోలీసు అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని ఎస్పీ ఓ ప్రకటనలో తెలిఎపారు.

## తీరుమార్చుకోని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

చిత్తూరుటౌన్, జులై 28 ప్రభాతవార్త:



గత ఎన్నికల్లో ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన తీరును మార్చుకోకుండా ప్రతిపక్ష హోదా కోసం హైకోర్టును ఆశ్రయించడం హాస్యా స్పదమని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు ఎగనామం పెట్టి ఢిల్లీలో ఫేక్ ధర్నాలు చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే శాంతిభద్రతలు మంట కలిశాయని గ్లోబల్ ప్రచారం చేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 36 మందిని హత్య చేశారని చెప్తున్న వారి వివరాలు వెల్లడించాలని ప్రశ్నిస్తే ఇప్పటి వరకు సమాధానం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు తనను ఓడించారని కక్షతో రాష్ట్రంలో అభివృద్ధి జరుగకుండా, పెట్టుబడులు రానీయకుండా ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## యధేచ్ఛగా ప్రకృతి సంపద నిలువు దోపిడీ

శ్రీరంగరాజపురం, జులై 28 ప్రభాతవార్త:



ప్రకృతి సంపదను యదేచ్ఛగా దోపిడి చేస్తు న్నారు. శని, ఆదివారాలు పండుగ రోజు కావడంతో దోపిడిదారులకు వరంగా మారా యి. అక్రమాలకు అడ్డుకోవాల్సి న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో దోపిడి దారులు ప్రకృతి సంపదను ఇష్టారా జ్యంగా తరలించుకెళ్ళిపోతున్నారు. ఎదో కొంత మొత్తం అధికారులకు ముట్టజెబితే మిన్నకుండిపోతారని భావించి అక్రమదారులు అధికారుల జేబుల్లోకి పైసలు పెట్టి వీరు మాత్రం ప్రకృతి పందపను లక్షల రూపాయల్లో కొల్లకొడుతున్నారు. శని, ఆదివారాలు అయితే మండల పరిధిలోని కొత్తపల్లిమిట్ట మీదుగా వేణుగోపాలపురం, ఎస్‌ఆర్‌పురంల మీదుగా చిత్తూరుకు సుమారు 20 నుండి 25 లారీలు గ్రానైట్ సందపను తీసుకెళ్తున్నాయి. ఒకొక్క లారీలో అయితే రెండు రాళ్ళను సైతం వేసి తీసుకెళ్తున్నారు, రాళ్ళు తీసుకెళ్ళడంలో లారీలు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మలుపుల వద్ద రాళ్ళు పడిపోయే ప్రమాదం వున్నప్పటికీ అక్రమార్కులు మాత్రం అటువైపుగా దర్జాగా వెళ్ళిపోతున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆషాడంతో కొండపై పెరిగిన భక్తుల రద్దీ



బోయకొండ(చౌడేపల్లి), జూలై 28 ప్రభాతవార్త

ఆషాడ మాసం కావడంతో శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. దీంతో బోయకొండ భక్తజన సంద్రమైంది. కొండదినాన్ని పురష్కరించుకొని వేదపండితులు, అర్చకులచే అమ్మవారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరం, ఆలయ అధికార, సిబ్బంది యాత్రీకులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసారు.

## ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం

సదుం, జూలై28ప్రభాతవార్త

సదుంలోని రేగల్లు రోడ్డులో శ్రీజైసీతారామ ఆశ్రమంలో వెలసిన శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రమణ్యసా ్వమి వారి ఆలయంలో ఆదివారం ద్వజారోహణంతో ఆడికృత్తిక మహోత్స వాలు ప్రారంభమైనాయి. ఈసందర్భంగా ఆలయం వద్ద వెంకటరమణ శర్మ పలురకాలు హోమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పలువురు ఆలయ కమిటీ సబ్యులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## కూటమి పాలనలో విద్యావ్యవస్థకు నూతనోత్తేజం

యర్రావారిపాలెం, జూలై 28 ప్రభాతవార్త



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పాలనలో విద్యావ్యవస్థకు నూతనోత్తేజం వస్తోందని తెలుగుదేశం పార్టీమండల మహిళా అధ్యక్షురాలు కొమ్మక లక్ష్మీదేవి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఏంకావాలో రాష్ట్రాబివృద్ధికి ఏం చేయాలో కూటమి ప్రభ్వుం ఆదిశగా అడుగులు వేస్తోందని ఆమె అన్నారు. ఈమేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జగన్‌రెడ్డి పెట్టిన పేర్లను తొలగించి భరత మాత ముద్దు బిడ్డల పేర్లతో పథకాలు ప్రకటించడం గొప్ప విషయమన్నారు. నాడు నేడు అంటూ పిల్ల చదువులపై కూడా రాజకీయం చేశాడని ద్వజమెత్తారు. పిల్లలు చదువుకునే పుస్తకాలపై కూడా జగన్ రెడ్డి లాంటి ఆర్థిక నేరస్తుడి పోటోలు ముద్రించడం అత్యంత దుర్మార్గం అన్నారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన అబ్దుల్ కలాం, ఆకలితీర్చిన డొక్కాసీతమ్మ,సర్వేపల్లె రాధాకృష్ణన్ వంటి మహనీయులతో పథకాలను అందించబోతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా, విద్యాకానుకను సర్వేపల్లె రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా గోరుముద్ద పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా నాడు నేడు పేరును మనబడి మనభవిష్యత్తుగా, స్వేచ్ఛ పథకాన్ని బాలికా రక్షపథకంగా, ఆణిముత్యాల పేరును అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారంగా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అబినందనీయం అన్నారు.

## ఐఎఫ్‌టియులో చేరిన పి.చైతన్య

చిత్తూరుటౌన్, జులై 28 ప్రభాతవార్త:



సీనియర్ కమ్యునిస్టు పార్టీ నేత పి.చైతన్య ఆదివారం సిపిఐ (ఎంఎల్) అనుబంధ కార్మిక సంస్థ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు)లో చేరారు. చిత్తూరు ఆర్‌అంబ్‌బి అతిధి గృహంలో ఆదివారం ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలోని కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ కమ్యునిస్టు నేత పి.చైతన్య సిపిఐ(ఎంఎల్) అనుబంధ కార్మిక సంస్థ భారత కార్మిక సంఘాల సమాఖ్యలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో పి.చైతన్యతో పాటు పలు సంఘాల నేతలు భారత కార్మిక సంఘాల సమాఖ్యలో చేరుతున్నట్లు ప్రకటించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎన్‌బీకేర్‌లో 31 న ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

కోట,జూలై 28 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( ఏపీపీఎస్సీ) డిపార్ట్‌మెంట్ పరీక్షలు జరగనున్నాయి.ఈనెల 31 వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, వరకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరగనున్నాయి.ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలని అధికారులు సూచించారు. సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని,అభ్యర్థుల హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

## తరగతి గదిలో గుణాత్మక బోధన

### ఎంఇఒ మస్తానయ్య

కోట,జూలై 28 ప్రభాతవార్త

మానసిక ఒత్తిక లేకుండా గణాత్మక బోధన చేసినప్పుడే పిల్లల్లో దాగున్న ప్రతిభ బయటపడుతోందని ఎంఇఒ డి.మస్తానయ్య పెర్కొన్నారు.కోట మండలంలోని ప్రధానోపాధ్యాయులకు, పిఆర్‌సిలకు నాయుడుపేటలో శిక్షాణతరగతలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచ్ టూల్ పేరిట ఉపాధ్యాయలకు ప్రత్యేక శిక్షణ తరగతలు నిర్వహిచండం జరిగిందన్నారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి పాఠాలు చెప్పినప్పుడే ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలు బహిర్గతమవుతాయన్నారు. విద్యార్థుల అభ్యసనస్థాయి మెరుగుపర్చేలా ఉపాధ్యాయులు వారి స్థాయికి వెళ్లి పాఠ్యాంశాలు బోధిస్తున్నారా ? వారు చెప్పే విధానం ఏ మేరకు అర్ధమవుతోంది.? ఉపాధ్యాయుడు 21 వ శతాబ్దం విద్యా నైపుణ్యాలు అమలు చేస్తున్నారా? లేదా అన్న అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రత్యేక యూప్‌లో ఆసమాచారం నమోదు చేయడం జరుగుతందన్నారు.ప్రతి పాఠశాల నుంచి శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయుడు పరిశీలకుడిగా వ్యహహరిస్తారని పేర్కొన్నారు.తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధనా భ్యాసన ప్రక్రియ తులనాత్మకంగా అంచనా వేసేందుకు టీచ్ టూల్ ఏంతోగాను ఉపయోగ పడుతోందన్నారు. అనుకున్న బోధన క్ష్యాలు నేరవేరుతాయన్నారు.ఈ శిక్షణ బోధన పద్ధతుల మెరుగుకు ఎంతగానో దోహపడుతుందన్నారు.పాఠ్య ప్రణాళిక అనుసరించి ఉపాధ్యాయుడు 28 రకాలైన కృత్యాలతో పాఠ్యాంశాలు బోధిస్తారని తెలిపారు.తద్వారా విద్యార్థుల అభ్యసనస్థాయి మెరుగుపడు తుందన్నారు.

## ఎండు పూలతో ఉపాధి అవకాశం-డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరి రూరల్, జూలై 28 ప్రభాతవార్త:

ఉద్యానవన సాగులో ఎండు పూలతో అలంకరణ చేసి జీవనోపాధి పొందే అవకాశాలు అధికంగా ఉన్నాయని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజులు అన్నారు. ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఎండు పూలతో ఉపాధిపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండు పూలు నిరుపయోగంగా పడవేయకుండా వాటితో కొత్త తరహాలో అలంకరణ చేయవచ్చునని తెలిపారు. అదేవిధంగా ఉద్యాన వన, పశుసంవర్ధక శాఖలు ఆధ్వర్యంలో కూడా కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళ రైతులకు, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం జరుగుతుంటాయని తెలిపారు. అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గంలోని రైతులు వ్యవసాయ సాగులో రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై మక్కువ చూపాలని వివరించారు. రైతుల్లో అవగాహన లేకపోవడంతో అధికంగా క్రిమిసంహారక మందులు వాడటం వల్ల భూములు తన ఉనికిని కోల్పోతున్నాయని, ప్రతి రైతు తప్పకుండా తమ భూములల్లో భూసార పరిక్షలు నిర్వహించి వ్యవసాయ అధికారులు సూచనలు సలహాల మేరకే ఎరువులు వాడకం చేయాలని తెలిపారు.

## టిడిపి కార్యనిర్వహణ అధ్యక్షులు

### కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియతో కోవి సుప్రియ భేటీ

బాలాయపల్లి, జులై 28, ప్రభాతవార్త



టిడిపి కార్యవర్గ నిర్వహణ అధ్యక్షురాలు కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ చెన్నైలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యురాలు కోవి సుప్రియ భేటీ అయ్యారు. రాబోయే రోజులలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్, ఐటిడిపి నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడానికి ప్రణాళిక రచించవల్సి ందిగా లక్ష్మీ సాయి ఆమెను కోరారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



గూడూరు, జులై 28, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని జనార్ధన్ రెడ్డి కాలనీలో బైరి వెంకటేశ్వర్లు స్వర్గస్థులు అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అంత్యక్రియలకు 5 వేల రూపాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తక్కెళ్ళ పాటి చంద్రమౌళి, మైనంపాటి మోహన్ కాశీ, తదితరులు పాల్గొన్నారు.

## తుక్కు బస్సులతో ప్రయాణీకుల అవస్థలు

కోట,జూలై 28 ప్రభాతవార్త



ఆర్టీసీ బస్సు ఛార్జీలను మూడు సార్లు పెంచేసిన వైకాపా ప్రభుత్వం బస్సుల నిర్వహణను మాత్రం గాలికొదిలేసింది. తుక్కు కింది మార్చాల్సి న వాటిని రొడ్డెంచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడింది. వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో వాకాడు డిపోలని కొన్ని బస్సుల్లో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.డిపో నుంచి బయలుదేరిన కొద్ది సమయా నికే ఆగిపోతున్నాయి.స్టీరింగ్ పట్టేసి,బ్రేకులు ఫెయిలవుతున్నాయి.జిల్లా వ్యాప్తంగా లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీ బస్సులు ఎక్కడ,ఎలా ప్రమాదానికి గురవుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది.జిల్లాలో మొత్తం బస్సుల్లో సగానికిపైగా పరిమితికి మించి తిరిగినవే ఉన్నాయి. ఏసీ బస్సుల్లో 70 శాతం బస్సులు 15 లక్షల కి,మీ దాటిపోయాయి. దూర ప్రాంతాలకు తిరిగే వీటిల్లో బ్రకేడౌన్స్ పెరిగిపోయాయి.సీట్లు ఊడిపోవడం, అద్దాలు, విరిగిపోయినా అలానే నడిపిస్తున్నారు. కోట.. నాయుడుపేట, కోట..గూడూరు పల్లె వెలుగు బస్సులు పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వ పాలనలోనైనా సురక్షిత ప్రయాణం అందిస్తారని ప్రజలంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

## అనుభవాల పొరల్లో ఆనందం వెతుక్కొంటూ...!

### -60యేళ్ళ తర్వాత కలసిన సహవాసాలు

### -విజయవాణి నగర్‌లో స్నేహ కేళీ

చౌడేపల్లి, జూలై 28 ప్రభాతవార్త



పేదరికం తాండవ మాడుతున్న కాలమది... చదువుపై మహిళల్లో అంతగా చైతన్యం లేని రోజులవి...అలాంటి గడ్డుకాలంలో ఎఎస్‌ఎల్‌సి చదవి ఉన్నత శిఖరాలదిరోవిరాంచిన వారే...అప్పట్లో చదివిన వారం దరిలో చాలామంది ప్రభుత్వ ఉద్యోగులుగా బాధ్యతలు చేపట్టి పదవీ విరమణ పొందిన వారున్నారు...ముదిమి వయస్సులో రారా పోరా అంటూ అలనాటి జ్ఞాపకాలను నెమర వేసుకొంటూ రోజంతా ఖుషీగా గడిపేశారు...ఏడు పదులు దాటిన వారందరి ఆత్మీయ కలయికకు విజయవాణి నగర్ వేదికయ్యింది...స్థానిక ఉన్నతపాఠశాలలో 1965-66 సంవత్సరపు ఎస్‌ఎస్‌ఎల్‌సి పూర్వపు విద్యార్థులందరూ మండలంలోని విజయవాణి నగర్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. మూడు తరాలను చూసిన అనుభవం ఉన్నవారందరూ పిల్లల స్థితిగతులను తెలుసుకొన్నారు. బడిపంతుల్లుగా, పోలీసులుగా, న్యాయవాదులుగా, తదితర ప్రభుత్వ కొలువులు చేసి విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న వృద్ధ యువకులు అరేయ్ ఒరేయ్ అనుకొంటూ అలనాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొన్నారు. తనపాటు చదువుకొన్న వారిలో 30మందిని గుర్తించడానికి సంవత్సర కాలం పట్టిందని 1965-66పూర్వపు విద్యార్థి ప్రస్తుత విజయవాణి సంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి, ఆయన స్నేహితుడు కె.సి.నాయుడులన్నారు. ఆత్మీయ మిత్రులందరినీ దుశ్శాలవాలతో సన్మానించి మెమొంటోలందించారు. విద్యనేర్పిన గురువులు సజీవంగా లేరనీ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించడం మినహా వారి కాళ్ళు తాకే భాగ్యం లేకపోయిందని బావోద్వేగానికి గురయ్యారు. ఏది ఏమైనప్పటికీ ముదిమి వయస్సులో అందరూ కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొంటూ రోజంతా హాయిగా గడిపారు. ఈ కార్యక్రమంలో 1965-66పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరుటౌన్, జులై 28 ప్రభాతవార్త:

జిల్లాలోని ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను విన్నవించుకుంటే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

## శివయ్య సేవకు పెరుగుతున్న భక్తులు: 25వేల మంది దర్శనం

### అభిషేకాలకు పెరుగుతున్న ఆదరణ

### ఐదువేల రాహుకేతుదోష నివారణ పూజలు

శ్రీకాళహస్తి, జూలై 28 ప్రభాతవార్త



దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి.ఆదివారం ఆలయం భక్తులతో కిట కిటలాడింది. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు.ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. ఇక వరుస సేలవులతో రద్దీ పెరుగుతుందని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు వివరించారు.ఆదివారం ఉదయం నుంచి భక్తులు రద్దీగా కనబడ్డారు.ముఖ్యంగా ఆలయంలో నిర్వహించే అభిషేకాలకు రద్దీ చోటు చేసుకుంది.ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 6వేల మంది కాగా రాహుకేతుదోష నివారణ పూజలు నాలుగు వేల ఐదు వందల మంది జరిపించుకున్నారు. అభిషేకాలకు రద్దీ ఏర్పడింది. రికార్డు స్థాయిలో 95 మంది అభిషేకాలు జరిపించుకోగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 36 జరిగాయి. అర్చనలు 107 ,గోపూజలకు 50 మంది దీపారాధన 31 హోమాలు 3 జరిగినట్లు అధికారులు వివరించారు.

**రాహుకేతు పూజలకు నిరీక్షణ:**

**తండోపతండాలుగా భక్తులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన లభిస్తుంది. దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. అయితే ఇక్కడకు వచ్చిన భక్తుల సమస్యలు వచ్చిన తరువాత కానీ అర్థం కావటం లేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే సామన్య భక్తులు బస కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతంగా మారింది.ఇక్కడ రద్దీ రోజుల్లో గదులు వేలరూపాయలు పలుకుతుంటే వచ్చిన సామన్య భక్తులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితి చోటు చేసుకుంటుంది.దేవస్థానంకు సంబంధించిన గదులు పరిమితంగా ఉన్నాయి. కొత్తగా లోబావిలో కైలాస సదన్‌లో 125 గదులున్నా తగిన సమాచారం లేదు.వాటికి సంబంధించి కూడా సమాచారం లేదు. దాంతో ఆటోల డ్రైవర్ల ఇష్టారాజ్యంగా మారింది.

## పాతకక్షల కారణంగా దాడులు

### -ముగ్గురిపై కేసు నమోదు

.తొట్టంబేడు, జూలై 28 ప్రభాతవార్త

మండలంలోని గుండేలిగుంట పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో ముగ్గురుపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన విజయకుమార్, గురునాథం, బాబులు కలసి మద్యం సేవించిన అనంతరం సురేష్, భార్య షర్మిళ, వెంకటసుబ్రమణ్యంలకు పాతగొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో మద్యం సేవించిన విజయకుమార్, గురునాథం, బాబులు కలసి వీరిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే 108కు సమాచారం అందించడంతో వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విజయకుమార్ గురునాథం, బాబులపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని వివరించారు. ఈసందర్భంగా ఎస్ఐ రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో కానీ, పట్టణాల్లో కానీ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలుతీసుకోవడమే కాకుండా జైలుశిక్ష పడుతుందన్నారు.

## భక్తుల కొంగుబంగారం... గుడివంక శ్రీ వల్లీదేవసేన సుబ్రమణ్యుడు

**- నేడు ఆడికృత్తిక ఉత్సవాలు.. భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు !!**



గుడుపల్లె, జూలై 28 ప్రభాతవార్త : కోరిక కోర్కెలు తీర్చుతూ భక్తుల కొంగుబంగారంగా మారారు గుడివంక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామివారు. ఏటా ఆడికృత్తిక ఉత్సవాలనుఈ ఆలయంలో ఘనంగా నిర్వహించడం జరుగుతోంది. మండలంలోని పెద్దగొల్లపల్లి గ్రామ పరిధి గుడివంక లోని వేపమాను కొండపై పచ్చటి ప్రకృతి అందాల మధ్య ఈ ఆలయం వెలసింది. భక్తులకు ఆలయం కనువిందు చేస్తోంది. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా మొక్కులు కలిగిన భక్తులు స్వామివారికి వివిధ రూపాలు, వివిధ ప్రదర్శనలతో తమ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. వీపుకు, నోట్లో శూలాలు గుచ్చుకోవడం, భారీ క్రేన్లకు కొక్కీలతో వేలాడుతూ విన్యాసాలు చేస్తూ భక్తులు తమ భక్తిని ప్రదర్శించడం జరుగుతుంది. గుడివంక శ్రీ సుబ్రమణ్యస్వామి ఉత్సవాలు అంటేనే కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలనుంచి భక్తులు ఇక్కడకు పోటెత్తు తారు. ఆడికృత్తిక రోజు లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పిస్తారు. సోమవారం ఆడికృత్తిక ఉత్సవాల నేపథ్యంలో దేవదాయశాఖ అధికారులు, ఉత్సవ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. స్వామివారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కాగా భక్తుల సౌకర్యార్థం కుప్పం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకబస్సులను నడపనున్నారు.

## ఇసుక అక్రమ దందా ప్రారంభం



నీవా నది నుండి అక్రమంగా ఇసుక రవాణా

చిత్తూరుటౌన్, జులై 28 ప్రభాతవార్త: ఓ వైపు ప్రభుత్వం ఇసుక రీచ్‌ల నుండి స్టాక్ పాయింట్లకు తరలించి వినియోగదారులకు ఉచితంగా ఇసుక రవాణా చేస్తామని ప్రకటించినప్పటికీ మరోవైపు ఇసుక రీచ్‌ల లేని ప్రాంతాల్లో పెద్ద ఎత్తులో ఇసుకను అక్రమంగా తరలించి దండుకొనే దందా ప్రారంభమైంది. యాదమరి మండల పరిధిలోని నీవా నదిలో గత నాలుగేళ్ళుగా నీటి ప్రవాహం వుండటంతో కొన్ని ప్రాంతాల్లో ఇసుక మేట ఎక్కువగా వుంది. గత ప్రభుత్వ హయాంలోనే అప్పటి వైకాపా నాయకులు ఈ ఇసుకను అక్రమంగా తరలించి వినియోగదారులకు విక్రయించి భారీగా సొమ్ములు జేబులు నింపుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార మార్పిడి జరుగడం, గత ప్రభుత్వం అమలు చేసిన ఇసుక విధానంను ప్రస్తుత కొత్త ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. అలాగే ప్రస్తుత ప్రభుత్వం జిల్లాలో ఇసుక రీచ్‌లను గుర్తించి అక్కడి నుండి స్టాక్ పాయింట్లకు ఇసుక సరఫరా చేసి అక్కడి నుండి వినియోగదారులకు అవసరమైన మేరకు ఇసుక సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సైతం రెండు రోజుల క్రితం ప్రస్తుతం వున్న ఇసుక రీచ్‌లు కాకుండా కొత్తగా ఇసుక లభ్యత వున్న ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాల్సిందిగా జిల్లా ఇసుక కమిటీ సభ్యులను ఆదేశించారు. ఈ క్రమంలో యాదమరి గ్రామంకు సమీపంలో వున్న పెరుమాళ్ళపల్లి నుండి పెరియంబాడి వరకు నీవా నది ప్రవాహం జోరుగా వుంటుంది. ఈ నాలుగేళ్ళుగా నదిలో నీటి ప్రవాహం వుండటంతో ఈ పరిసరాల్లో భారీగా ఇసుక మేట ఏర్పడింది. ఈ క్రమంలో ఇక్కడి ఇసుకను అక్రమంగా తరలించి డబ్బులు చేసుకోవాలని నిర్ణయించిన కొంతమంది పట్టపగలే అక్కడికి జెసిబి తీసుకెళ్ళి ట్రాక్టర్ల ద్వారా స్టాక్ పాయింట్లకు ఇసుక రవాణా ప్రారంభించారు. అయితే ఈ విషయం తెలియడంతో కొంతమంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు సమాచారం అందిన విషయం తెలుసుకున్న ఇసుక అక్రమ రవాణా దారులు అక్కడి నుండి వాహనాలను తీసుకెళ్ళిపోయారు. అయితే పోలీసులు వెళ్ళి ఇసుకను తరలించిన డంప్ వద్దకు చేరుకుని ఇసుకను సీజ్ చేసినట్లు తెలిసింది.

## టెంపోట్రావెలర్ బోల్తా .. ఇద్దరికి తీవ్రగాయాలు



**మరో నలుగురికి స్వల్పగాయాలు**

చంద్రగిరి, జూలై 28 ప్రభాతవార్త: ముందు వెళుతున్న లారీని అధిగమిం చబోయి ఢీకొట్టిన టెంపోట్రావెలర్ బోల్తాపడిన ఘటన ఆదివారం కాశిపెంట్ల వద్ద చోటు చేసుకున్నది. హైదరాబాద్‌కు చెందిన 12 మందితో కూడిన టెంపో ట్రావెలర్ కాణిపాకం వెళుతుండగా కాశి పెంట్ల వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ (50)తో పాటు మోహన్‌కృష్ణ (44)కు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా పి.సరిత(45), వి.పద్మావతి(40), హైమవతి(50), హర్షిత్ రెడ్డి(18) స్వల్ప గాయాల పాలయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. రోడ్డుపై పడివున్న వాహనాన్ని తొలగించి, ట్రిఫిక్‌ను క్లియర్ చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



## టిటిడి అదనపు ఈఓ వెంకయ్యకు,,, ఆత్మీయ అభినందనలు

**టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆత్మీయ అభినందనలు తెలిపారు.**

**ప్రభాతవార్త-తిరుమల**

## సిఎం చంద్రబాబు అలా భావించి ఉంటే...వైఎస్సార్సీ నేతలకు జైళ్లు సరిపోవు

**- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

కుప్పం, జూలై 28 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు కక్షసాధించాలి అని భావించి ఉంటే ఈ నలభై రోజుల్లోనే రాష్ట్రంలో విధ్వంసం జరిగేదని, వైఎస్సార్సీ నేతలకు రాష్ట్రంలో ఉన్న జైళ్లు సరిపోయేవి కావని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు 11సీట్లతో చిత్తుచిత్తుగా ఓడించినా జగన్‌కు ఇంకా జ్ఞానం రాలేదని తమ ప్రభుత్వంపై సంస్కార హీనంగా ఆరోపణలు చేయడం దారుణమని పేర్కొన్నారు. అవాస్తవాలు వండివార్చుతున్నారని విమర్శించారు. తప్పుచేసిన వారిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని ఇదివరకే సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఎలాంటి తప్పులకు పాల్పడకుండా కార్యకర్తలకు సూచించాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు సైతం సిఎం చంద్రబాబు సూచించి ఉన్నారన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేదని జగన్‌కు సిఎం చంద్రబాబు తగు మర్యాద ఇచ్చినా జగన్ స oస్కారహీనంగా మారారని పేర్కొన్నారు. గతంలో కుప్పం నుంచి భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తానన్న జగన్ బిసిలపై ప్రేమ ఉంటే భరత్‌ను శాసనమండలి పక్ష నేతగా ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. సొంత సామాజిక వర్గానికి చెందిన అప్పిరెడ్డిని నియమించు కున్నారని విమర్శించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి 250కోట్లతో ప్రతిపాదనలు పంపగా మంజూరు లభించిందన్నారు. అలాగే కుప్పంలో రెండువేల ఎకరాలతో సెజ్ ఏర్పాటుకు భూములను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం వైఎస్సార్సీ అరాచకాలు బయటపెడతామని ఇప్పటికే కుప్పం రెస్కోలో సహకార సంస్థ, విజిలెన్స్ అధికారుల విచారణలు జరుగుతున్నాయన్నారు. మాజీ ఛైర్మన్ వరకు అటెండర్ స్థాయి వరకు తప్పు చేసిన వారిని జైలుకు పంపుతా మన్నా రు. కుప్పంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటా



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ డా॥ కంచర్ల

మన్నారు. కుప్పంలో చంద్రబాబును ఓడించడం జగన్ తాత తరం కూడా కాదన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, నారా భువన మ్మలు కుప్పం ప్రజల జీవితాలు మార్చు తారన్నారు. కుప్పంలో నాలుగు రోజులు పర్యటి ంచిన నారా భువనమ్మకు ప్రజలు నీరాజనాలు పలికారన్నారు. పేదరికం లేని కుప్పం కోసం నారా భువనమ్మ కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండలపార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, కాణిపాకం వెంకటేష్, ప్రతాప్, నామాలప్ప తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహరికోట స్పేస్ సెంట్రల్ స్కూల్‌కు 50 ఏళ్లు



శ్రీహరికోట (తడ), జూలై 28 ప్రభాతవార్త : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో స్పేస్ సెంట్రల్ స్కూల్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా షార్ యాజమాన్యం క్రీడా పోటీలు నిర్వహించింది. అయితే ఈ పోటీలను శ్రీహరికోటలో కాకుండా సూళ్లూరుపేటలో ఉన్న షార్ ఉద్యోగుల కాలనీ కెఆర్ పాలెంలో నిర్వహించారు. పులికాట్ నగర్‌గా పిలిచే కెఆర్‌పాలెంలోని స్పేస్‌సెంట్రల్ స్కూల్ వద్ద ఈ పోటీలు రెండురోజుల పాటు ఘనంగా జరిగాయి. కేవలం షార్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంతరిక్ష కేంద్రీయ పాఠశాలలో మాత్రమే కాకుండా సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ మండలాల పరిధిలో ఉన్న కొన్ని సిబిఎస్ఇ సిలబస్ పాఠశాలల విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారు. షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్‌తో పాటు పలువురు ఇస్రో అధికారులు, ఉద్యోగులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పెద్దసంఖ్య లో విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. కేవలం గేమ్స్ మాత్రమే కాకుండా అథ్లెటిక్స్ పోటీలు కూడా జరిపారు.

## ..డాయ్ యాప్ ఘటనపై విచారణ కమిటీ : కలెక్టర్

చిత్తూరుటౌన్, జులై 28 ప్రభాతవార్త: పలమనేరు పరిసరాల్లో డాయ్ యాప్ పేరిట ప్రజలను మోసం చేసిన బాధితులకు న్యాయం చేయడానికి మెప్మా పిడి రాధామ్మ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో మెప్మా పిడి రాధమ్మతో పాటు రెవెన్యూ శాఖ నుండి డిప్యుటీ తహసిల్దారు, పోలీసు శాఖ తరపున పలమనేరు ఇన్స్‌పెక్టర్ వుంటారని వీరు ఈ ఘటనపై విచారించి బాధితులకు న్యాయం చేస్తారన్నారు. ఈ కమిటీ సభ్యులు సోమ, మంగళవారాల్లో పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి పని వేళలు ముగిసే వరకు బాధితులకు అందుబాటులో వుంటారన్నారు. బాధితులు విచారణ కమిటీ ఎదుట హాజరై తమ ఫిర్యాదులను ఇవ్వాలని కలెక్టర్ కోరారు.

## వాడ వాడలా ఘనంగా భరణి కృత్తిక పూజలు



నారాయణవనం, జూలై 28 ప్రభాతవార్త : సుబ్రమణ్యంస్వామి పవిత్ర నెల అయిన ఆడినెలలో వచ్చే ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకొని ఆదివారం భరణీ కృత్తిక మొక్కు కలిగిన భక్తులు తమతమ ఇళ్లలను శుద్ధి చేసిన తర్వాత సుబ్రమణ్య స్వామికి పూజలను నిర్వహించారు. హరోం హర నామంతో సుబ్రమణ్యంస్వామి ఆలయాలు పులకిం చింది. అంతేకాకుండా మొక్కుబడి కలిగిన వందలాది మంది భక్తులు సముదాయం, నారాయ ణవనం నుంచి హరోం..హర నామంతో కావళ్లతో తిరుత్తణి, పుత్తూరు, కైలాసకోనకు బయలుదేరారు. భక్తులు తమ ఇళ్ళల్లో తయారు చేసిన పిండివంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఇకపోతే కైలాసనాధకోనలో వెలసిన బాలసుబ్రమణ్యంస్వామి ఆలయంలో భరణి కృత్తిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు కావడితో తరలివచ్చి స్వామి వారికి సమర్పించుకున్నారు.



## భక్తిశ్రద్ధలతో భరణి కావడి

విజయపురం, జూలై 28 ప్రభాతవార్త: మండలంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు సుబ్రహ్మణ్యస్వామికి కావడి తీశారు. మండలంలోని కళియంబాకం, పన్నూరు, ఆమగుంట, తెల్లగుంట, విజయపురం, ఎం అగరం, కేవీ పురం, కాళికాపురం, ఆలపాకం గ్రామాల్లో కావడి తీశారు. భక్తులు రామగిరి, తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు భక్తులు తరలివెళ్లారు.

## మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 28 ప్రభాతవార్త : జూలై 29వ తేది సోమవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మీ కోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇకపై ప్రతి సోమవారం మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు.

## సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైన క్రీడాకారులు



తిరుపతి క్రీడ, జులై 28 ప్రభాతవార్త : తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు నిర్వహిం చారు. ఈ ఎంపికల్లో బాలుర విభాగంలో బి. కరుణ కుమార్, ఆర్ విశాల్ రాజ్, బి.జయ సాయి ఐకుమార్, ఎన్ ముని హిమ సాయి, ఎం. జీవన్, టి. గురు రోహిత్, మునిపురంధర్, వై. గౌతం కృష్ణ, రిజర్వ్‌డ్ కేటగిరిలో ఎస్ సూరజ్, బాలికల విభాగం లో బి. మహిత, కె. చందన, సిహెచ్ చైతన్య శ్రీ, ఎం. చాందిని ఎంపిక అయినట్లు తిరుపతి జిల్లా డిఎస్డిఏ సయ్యద్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి డి. సుధీర్ తెలిపారు. ఎంపికైన జట్లు విజయవాడలో ఆగస్టు 4,5 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ రాష్ట్ర జిల్లా ఎంపికల్లో పాల్గొంటాయన్నారు.

## ప్రజలకు పారదర్శకపాలన : ఎమ్మెల్యే జగన్ మోహన్



తిరుమల, జులై 28ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో చిత్తూరు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందని, పారదర్శక పాలన సాగిస్తానని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను, సంక్షేమాన్ని ప్రజలకు చేరువగా అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన అనుచరులతో కలసి ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. టిటిడి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజానేతగా ఉన్నతపదవిలో రాణించాలి

**-సూరాసుధాకర్‌రెడ్డికి నేతల ఆకాంక్ష**



తిరుపతిటౌన్, జులై 28ప్రభాతవార్త: పార్టీ పదవితో సంబం ధం లేకుండా, పార్టీ సంక్షేమమే ధ్యేయంగా, కార్యకర్తలకు అండగా నిలబడి పనిచేస్తున్న టిడిపి సీనియర్ నేత, రాష్ట్రపార్టీ కార్యదర్శి సూరా సుధాకర్‌రెడ్డి ఉన్నత పదవిలో రాణించాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. తొలినుండి తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ, పార్టీకోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆయనకు ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారాలోకేశ్ తిరుపతి జిల్లాలో నామినేటెడ్ పదవి అప్పగించి మరింతగా కార్యకర్తలకు, ప్రజలకు అండగా నిలబడేలా చూడాలని పార్టీ నేతలు కోరారు. ఆదివారం ఆయనకు టిడిపి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో సత్కరించారు.

## ఆడికృత్తికకు కుమారస్వామి ఆలయం ముస్తాబు



శ్రీకాళహస్తి, జూలై 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తికమహోత్స వాలకు ఏర్పాట్లు ను అధికారులు అతికష్టం మీద చేపట్టారు. ఆడికృత్తిక సందర్భంగా ప్రధాన ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమ య్యాయి. ప్రధాన ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టారు. ఆదివారం నుంచి ఆలయాన్ని చక్కగా విద్యుద్దీపాలంకారాలతో ముస్తాబు చేశారు. కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ఆలయాన్ని ముస్తాబు చేశారు.పరిసరాల్ని పండగ వాతావరణంలా తీర్చి దిద్దారు. కోనేరులో నీటి కొరత ఉన్నా పంపులతో నింపారు. కోనేరులోని చెత్తా చెదారాల్ని తీసి శుభ్రం చేశారు. సాధారణంగా కొందరు భక్తులు భరణి సందర్భంగా స్వామిని దర్శించు కోవటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఆదివారం భరణి రావటంతో ఆలయం వద్ద దుకాణాలలో కళకళ లాడుతున్నాయి. సమీప గ్రామాల నుంచి కొందరుభక్తులు కావళ్ళతో 'హరోం హర'అంటూ కదలి రావటం ఆనవాయితి. కానీ ఈ ఏడాది భరణి,ఆడికృత్తికలు ఆదివారం మధ్యాహ్నం నుండి మంగళ వారం ఉదయం ఉండడంతో భక్తుల తాకిడి ఇంకా పెరగలేదు. పట్టణానికి చెందిన కొందరు భక్తులు మాత్రం కావళ్ళతో కదలి వచ్చి కుమారస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

**దుకాణాల వద్ద కానరాని రద్దీ:** శ్రీకాళహస్తిలో ఆదివారం సాయంత్రం నుంచి కొందరుభక్తులు కావళ్ళతో పసుపు బట్టలు ధరించి కుమారస్వామిని స్తుతిస్తూ కదలి వచ్చారు. ఇక సాధారణంగా ఆడికృత్తిక సందర్భంగా ఆలయంలో మొక్కులు తీర్చుకుంటారు. ఆడికృత్తిక సందర్భంగా గ్రామాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకునే వారు కావళ్ళను అందుకు అవసరమైన వస్తువుల కొనుగోళ్ళలో రద్దీ కనబడేది. అయితే ఈ ఏడాది దుకాణాలు వెల వెల బోతున్నాయి.గతంలో ఉన్నంత ఉత్సాహం పండగల సందర్భంగా కనబడలేదు. ఆడికృత్తిక సందర్భంగా శ్రీకాళహస్తిలో వెలసిన కుమారస్వామిని సుమారు 50వేల మందికి పైగా దర్శించుకుంటారు. ఆదివారం కూడా రద్దీ కనబడక పోవటంతో ఒకే సారి సోమవారం తరలి వస్తారని ఏర్పాట్లు, సత్వర,సుదర్శనం కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బాబూ అగ్రహారం కోనేరు వద్ద తలనీలాలు సమర్పించుకొనుటకు దేవస్థానం అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సెక్యూరిటి ఏర్పాటు చేశారు. ఇక్కడ భక్తుల సౌకర్యార్థం మజిలి దుకాణాల్ని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌ను మళ్ళీంచారు. కుమారస్వామి తిప్పపై చక్కగా పందిళ్ళు ఏర్పాటు చేశారు. శాశ్వత పందిళ్ళు ఏర్పాటు చేశారు.ప్రసాదాల తయారి కౌంటర్లు ఏర్పాటు చేశారు.







# కుమారస్వామిని దర్శించుకున్న భక్తులు



శ్రీకాళహస్తి,జూలై 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామిని భరణి సందర్భంగా ఆదివారం సాయంత్రం చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.శ్రీకాళహస్తి పరిసరప్రాంతాలకుచెందిన పలువురు తిరుత్తణికి బయలుదేరి వెళ్ళారు. సామాన్య ప్రజలు పూజలు,అభిషేకాలు జరిపించుకున్నారు.భరణి ప్రారంభం కాగానే ఉత్సవాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, అధికారులు ఎలాంటి విఘ్నాలు లేకుండా ఉత్సవాలు విజయవంతం కావాలని మొక్కుకున్నారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో తమిళ పండుగలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఈ పట్టణంలో సుమారు 10 నుంచి 15వేల మంది తమిళులు నివాసముంటున్నారు. అంతేకాక సుబ్రమణ్యం స్వామిని దర్శించుకొనుటకు స్థానికులు కూడా తరలిరావటం ఆనవాయితి. ప్రతి మంగళవారం విజ్ఞాన గిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి, తేరువీధిలోని షణ్ముఖ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు వందలాది లీటర్ల పాలతో అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఆదివారం ఆడికృత్తిక భరణి సందర్భంగా ఆలయాన్ని చక్కగా మామిడితోరణాలు, అరటి చెట్లతో, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నారు. భరణి ఘడియల నుంచే ఆలయాల్లో ఓ మోస్తరు భక్తుల రద్దీ కనబడేది. అయితే పనుల వత్తిడి రెండు రోజులు పండగలు జరుపుకునే ఆర్థిక స్థితి లేదు కాబట్టి ఒక్కరోజే రద్దీ కనబడుతుంది. గతంలో భక్తులు తమిళనాడులోని తిరుత్తణికి కదలితరంగాల్లా కదలి వెళ్ళేవారు. కానీ నేడు ఆ వాతావరణం కనబడటం లేదు. ప్రైవేటు బస్సులు ఖాళీగా జనం కోసం నిరీక్షించటం కనబడింది. ఆదివారం మధ్యాహ్నం భక్తులు చక్కగా ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు. ఇక్కడ ఏర్పాట్లను ఇక్కడి ఉత్సవాల పర్యవేక్షణకు లక్ష్మయ్య, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటస్వామిలను నియమించారు. ఆలయం వద్ద పూర్తి బాధ్యతను ఎఇఓ లోకేష్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కాగా ఉత్సవాల పర్యవేక్షణకు హరియాదవ్, సుదర్శనం నాయుడు,నాగభూషణం యాదవ్,సుబ్రమణ్యం తదితరులుపర్యవేక్షిస్తున్నారు.